జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 11 | మార్చి | 2026 ◆ పేజీలు : 9


## విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కారాదు

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి 10:ప్రజాజ్యోతి** జిల్లాలోని విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్తో కలిసి జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంఈఓలు, ఆర్సీవోలు, ఇతర అధికారులతో

మిగతా 2 లో...



## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజా ప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 10,ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమావేశమై ఈ నెల 12వ తేదీన ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడిందని తెలిపారు. ఈ కార్యాచరణను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని గ్రామపంచాయతీల

మిగతా 2 లో...

## జమాయిల్ తోట నరికివేతతో సింగరేణికి భారీ నష్టం

- కలప దొరికింది... దొంగలు ఎక్కడ?
- అధికారుల నిర్లక్ష్యంపై కార్మిక వర్గాల ఆగ్రహం



**టేకులపల్లి,మార్చి 10, ప్రజాజ్యోతి:** సింగరేణి కేఓసీ పరిధిలోని జమాయిల్ తోటలో జరుగుతున్న అక్రమ నరికివేతతో సంస్థకు భారీ నష్టం వాటిల్లుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై ప్రచురితమైన కథనానికి స్పందించిన సింగరేణి అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.జీఎం విసం కృష్ణయ్య ఆదేశాల మేరకు సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది, కేఓసీ పర్యావరణ అధికారులు

మిగతా 2 లో...

## ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో మళ్లీ వివాదం

- 8వ తరగతి విద్యార్థిని అవమానించారన్న ఆరోపణలు
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన కుటుంబ సభ్యులు



**కొత్తగూడెం , మార్చి 10 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో మరోసారి వివాదం చెలరేగింది. గతంలో చోటు చేసుకున్న ఘటన మరువకముందే తాజాగా 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని టీచర్లు అవమానించారన్న ఆరోపణలు వెలుగులోకి రావడం సంచలనం రేపుతోంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం స్కూల్‌లో జరిగిన ఒక వివాదంలో భాగంగా సంబంధిత విద్యార్థినిని స్కూల్‌లో ఉండొద్దని చెప్పి ఆమె బ్యాగులను

మిగతా 2 లో...

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్



**భద్రాచలం, మార్చి 10 (ప్రజాజ్యోతి):** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని మంగళవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం వైదిక సిబ్బంది సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం వైదిక సిబ్బంది బొజ్జిరెడ్డికి వేదాశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామాలయంలోని దాసాంజనేయస్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

## విద్యాసంస్థలు, వసతి గృహాల్లో కలుషిత ఆహార ఘటనలు పునరావృతం కారాదు

(మొదటి పేజీ తరువాయి...)

టెలీకాన్ఫరెన్స్ ద్వారా విద్యాసంస్థల్లో ఆహార భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత ఆర్‌సీవోలు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులదేనని అన్నారు, కలుషిత ఆహార ఘటనలపై కేవలం వంట తయారు చేసే వారిపై ,వార్డెన్లపై చర్యలు తీసుకోవడం సరిపోదని, ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత ఆర్‌సీవోలు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయి అధికారులపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల మణుగూరులోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన కలుషిత ఆహార ఘటన దురదృష్టకరమని కలెక్టర్ అన్నారు, ప్రాథమిక సమాచారం ప్రకారం కొందరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులు ఇంటి నుండి తీసుకువచ్చిన బిర్యానీ, మాంసాహార పదార్థాలు తీసుకోవడంతో అస్వస్థతకు గురైనట్లు వెల్లడైంది. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన ఆహార భద్రత కమిటీ సభ్యులు ముందుగా వండిన ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన తరువాత మాత్రమే విద్యార్థులకు వడ్డించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యమైనది, పరిశుభ్రమైనది, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థలు, వసతి గృహాలను తరచూ సందర్శిస్తూ ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఎర్రగుంట పీహెచ్ సీలో ఉచిత నిపుణుల వైద్య శిబిరం

- 205 మంది రోగులకు వైద్య పరీక్షలు – ఉచిత మందుల పంపిణీ
- మహిళలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని సేవలు వినియోగం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 10,ప్రజా జ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నిపుణుల వైద్య శిబిరం ప్రజల నుంచి మంచి స్పందన పొందింది. జిల్లా కలెక్టర్ మరియు వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరాన్ని పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక పర్యవేక్షించారు. జిల్లాలోని నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఎర్రగుంట మరియు పరిసర గ్రామాల నుంచి మొత్తం 205 మంది రోగులు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు.విభాగాల వారీగా స్త్రీ సంబంధిత వ్యాధుల కోసం డాక్టర్ వాసంతి 16 మందిని, చిన్నపిల్లల వైద్యం కోసం డాక్టర్ సాధన 6 మందిని, కంటి సంబంధిత పరీక్షల కోసం డాక్టర్ రచన 23 మందిని, ఎముకల సంబంధిత వ్యాధుల కోసం డాక్టర్ దినేష్ 29 మందిని, సాధారణ వైద్య విభాగంలో డాక్టర్ గోపి 57 మందిని పరీక్షించారు. అదేవిధంగా మధుమేహం మరియు రక్తపోటు సమస్యలతో వచ్చిన 74 మందికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్య పరీక్షల అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు రక్త పరీక్షలు, రక్తపోటు మరియు చక్కెర పరీక్షలు కూడా నిర్వహించారు.ఈ శిబిరాన్ని అన్నపురెడ్డిపల్లి మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి మరియు అన్నపురెడ్డిపల్లి మండల పంచాయతీ అధికారి షబ్నా సందర్శించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పెద్దిరెడ్డి గూడెం సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ నరేష్, స్థానిక నాయకులు రమణతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు, పీహెచ్ సీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలకు డాక్టర్ ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రజా ప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



సర్పంచ్‌లు, మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలులో ప్రజా ప్రతినిధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు, పాత్రపై అవగాహన కల్పించాలి అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవాల్సిన చర్యలపై కూడా వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలపై కూడా ప్రజా ప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్ల సహాయంతో సులభంగా అర్థమయ్యే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుకు శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ–ఆఫీస్ విధానంలో పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో త్రాగు నీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను దశల వారీగా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , డిపిఓ సుధీర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌డీజీ స్కూల్‌లో మళ్లీ వివాదం

(మొదటి పేజీ తరువాయి...)

బయటకు విసిరేశారనే ఆరోపించారు. ఈ ఘటనపై విద్యార్థిని కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పట్ల అవమానకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను ప్రశ్నించిన కుటుంబ సభ్యులను కులం పేరుతో అవమానించడం జరిగిందని తెలిపారు. తమను తక్కువ కులం చేస్తూ అవమానకరంగా మాట్లాడ టం చాలా బాధాకరమని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను ఆశ్రయించారు. ఇదిలా ఉండ గా ఇదే స్కూల్‌లో గతంలో ఉపాధ్యాయుల అధిక ఒత్తిడి కారణంగా ఒక విద్యార్థి ఎలుకల మందు తాగిన ఘటన కూడా అప్పట్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఆ ఘటనపై పూర్తి స్థాయి స్పందన రాకముందే మరో వివాదం వెలుగులోకి రావడం స్థానికంగా మళ్లీ చర్చకు దారితీసింది. తాజా ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం ఉన్నది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. పోలీస్ అధికారుల దర్యాప్తు అనంతరం అసలు విషయాలు బయటపడే అవకాశం ఉంది.

**››› విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు తప్పుగా ఏమి మాట్లాడలేదు: ఎస్‌ఆర్‌డీజీ స్కూల్ జోనల్ ఇన్‌చార్జ్ సతీష్**

చుంచుపల్లి మండల పరిధిలోని ఎస్‌ఆర్‌డీజీ స్కూల్‌లో చోటుచేసుకున్న ఘటనపై పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ సతీష్‌ను ప్రజా జ్యోతి ప్రతినిధి వివరణ కోరగా ఆయన స్పందించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నట్లుగా తమ పాఠశాల ఉపాధ్యాయులు కులం పేరుతో దూషించలేదని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల సమయంలో తోటి విద్యార్థులతో ఆటలాడుతున్న ఆ విద్యార్థినిని క్రమశిక్షణలో భాగంగా మందలించడం మాత్రమే జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పని చేస్తారని విద్యార్థుల అభ్యున్నతికే తమ పాఠశాల ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో ఎలాంటి వివక్షకు తావు లేదని ఉపాధ్యాయులు విద్యార్థులందరినీ సమానంగా చూస్తారని సతీష్ తెలిపారు. ఈ అంశంపై నిజానిజాలు వెలుగులోకి రావడానికి సంబంధిత అధికారులు విచారణ జరిపితే పూర్తి వివరాలు బయటపడతాయని ఆయన అన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బొలెరో వాహనం

**చర్ల, మార్చ్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం కలివేరు సత్యనారాయణపురం ప్రధాన రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన బొలెరో వాహనం ఈ రోడ్డు ప్రమాదంలో చర్ల మండలం బత్తెనపల్లి గ్రామానికి చెందిన గట్టుపల్లి బాలు, మడకం అశోక్లు తీవ్ర గాయాల పాలయ్యారు. గమనించిన స్థానికులు హుటాహుటిన సత్యనారాయణపురం ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు.





## జమాయిల్ తోట నరికివేతతో సింగరేణికి భారీ నష్టం

(మొదటి పేజీ తరువాయి...)

జమాయిల్ తోటలో తనిఖీలు చేపట్టగా అక్కడ ఉన్న కలప స్మగ్లర్లు అధికారులను చూసి పరారైనట్లు తెలిపారు. తనిఖీల్లో సుమారు 30 టన్నుల జమాయిల్ చెట్లను నరికి పడేసినట్లు అధికారులు గుర్తించారు.ఘటనాస్థలంలో గొడ్డలి, 8 పీఎం క్వార్టర్ బాటిల్, 20 లీటర్ల వాటర్ క్యాన్, చెట్లు నరికేందుకు ఉపయోగించే పరికరాలు లభించినట్లు సమాచారం. అయితే జమాయిల్ తోటలో రోజువారీగా 30 నుంచి 50 టన్నుల వరకు చెట్ల నరికివేత జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సింగరేణికి సుమారు రూ.30 నుంచి 40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. కేఓసీ మైన్ పరిధిలో ఇలాంటి అక్రమాలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించడం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అసలు నరికివేతకు పాల్పడుతున్న దొంగలను పట్టుకోవాల్సింది పోయి అక్కడ దొరికిన పరికరాలను మాత్రమే స్వాధీనం చేసుకోవడం సరైంది కాదని విమర్శిస్తున్నారు. అక్రమ నరికివేతకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కార్మిక వర్గాలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి.

## కులమతాలకు ప్రతీక రంజాన్ -ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన పింగళి



**ఇల్లందు, మార్చి 10, ప్రజాజ్యోతి:** కులమతాలకు ప్రతీక రంజాన్ అని 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ అన్నారు. సర్వమానవ సౌభ్రాతృత్వం ధ్యేయంగా 19వ వార్డు కౌన్సిలర్ మసీద్ ఈ మొహమ్మదియాలో ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పింగళి నరేష్ అనూహ్య మాట్లాడుతూ గోవింద్ సెంటర్ ప్రాంతంలో ఎప్పటి నుంచో హిందూ ముస్లింలు అన్నదమ్ములవలే కలిసి ఉన్నారని తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన పింగళి నరేష్ అనూహ్య, పగడాల చందును ముస్లిం పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించి పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో పగడాల చందు, సదర్ గౌస్ పాషా, మొలాసహాబ్ ఖుద్దూస్, యాకుబ్ పాషా, గౌస్ మెస్త్రీ, ముస్లిం మత పెద్దలు, గోవింద్ సెంటర్ యువత పాల్గొన్నారు.

# జెకె బస్టాండా... పార్కింగ్ కు అడ్డానా!

- -ప్రయాణికులకు ప్రవేశం లేకుండా అన్ని వాహనాలే
- -ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- -అధికారులు జర స్పందించరూ!



**ఇల్లందు, మార్చి 10, ప్రజాజ్యోతి:** ఇల్లందు పట్టణంలోని జెకె కాలనీలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం కొన్ని ఏండ్ల నుంచి బస్టాండ్ ఏర్పాటు చేయడం జరిగింది. మరి ముఖ్యంగా కార్మికులు అధికంగా క్వార్టర్స్ లతో పాటు సంజయ్ నగర్, బాలాజీ నగర్, వెంగళరావు నగర్, కొత్త కాలనీలలో నివసించే ప్రజలు వివిధ ప్రాంతాలకు బస్సులలో ప్రయాణించేందుకు సింగరేణి యాజమాన్యం జెకె బస్టాండ్ ను ఏర్పాటు చేసింది. కానీ గత కొన్ని రోజుల నుండి ఈ జెకె బస్టాండ్ ప్రయాణికులకు ఎంత మాత్రం ఉపయోగపడకపోగా, కేవలం ద్విచక్ర వాహనాలకు అడ్డాగా మారిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు సేద తీరేందుకు జెకె బస్టాండ్ ను ఏర్పాటు చేసినా కానీ అందులో ప్రయాణికులు కూర్చోవడం దేవుడేరుగు.. కనీసం నిలబడే పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇల్లందు నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు వారి వాహనాలను జెకె బస్టాండ్ లో పార్కింగ్ చేసి వెళ్తున్నారు. కానీ ఇతర ప్రయాణికులు బస్సులు ఆలస్యం అయినప్పుడు జెకె బస్టాండ్ లో కూర్చునేందుకు అన్ని వసతులు ఉన్నప్పటికీ ప్రస్తుతం అవి ఎవరికి ఉపయోగపడడం లేదనేది కండ్లకు కనిపిస్తుంది. గత కొన్ని నెలల నుండి ఇదే తంతు కొనసాగుతున్నప్పటికీ, పలు శాఖల ఉన్నతాధికారులు ఆ జెకె బస్టాండ్ మీదుగానే వెళ్తుంటారు. కానీ ఆ అధికారులకు జెకె బస్టాండ్ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిందని, అందులో వాహనాలు పార్కింగ్ చేసినట్లు కనిపిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ఇలా ద్విచక్ర వాహనాలను జెకె బస్టాండ్ లో పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు ఇటు కూర్చోలేక.. అటు నిలబడలేక అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్సుల కోసం వేచి ఉండే వృద్ధుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా సంబంధిత సంబంధిత శాఖాధికారులు జర స్పందించి ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన జెకె బస్టాండ్ ను వారికే ఉపయోగపడేలా చూడాలని, వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు




**కొత్తగూడెం, మార్చి 10, ప్రజాజ్యోతి** దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు ప్రముఖ సంఘ సంస్కర్త మాతా సావిత్రిబాయి పూలే అని ఐ.ఎల్.పి.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, న్యాయవాది సుంకర భానుప్రియ అన్నారు. మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా కొత్తగూడెం న్యాయవాదుల లైబ్రరీ హాల్ లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుల, మత భేదాలకు అతీతంగా ఆధునిక విద్య ద్వారానే మహిళల విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలేతో కలిసి 1848 జనవరి 1న పూణేలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు నాంది పలికారన్నారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ పీడిత ప్రజలు, ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన తొలి తరపు ఉద్యమకారిణి అని కొనియాడారు. సావిత్రిబాయి పూలే ఆశయాలు లక్ష్యాలను ఆచరణలో పెట్టాలనుకునే ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. దేశానికి తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేనని యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతి, యువకులు ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, యెర్రా కామేష్, మల్లెల ఉషారాణి, అడపాల పార్వతీ, నీలవేణి, గోపీకృష్ణ, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, నాగస్రవంతి, శ్వేత, స్వప్న, సంధ్యారాణి, పద్మకళ, బేబీ షామిలి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్



**చర్ల, మార్చ్ 10:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు లో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం మిషన్ హెల్త్ 100 డేస్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ డి.ఆమ్.హెచ్.ఓహ్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాని సర్పంచ్ కాక రాజుగారు ప్రారంభించారు.ఈ శిబిరం లో చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల గ్రామాలలో నుండి మూడు వందల రెండు మంది ఆరోగ్య సేవలు పొందటం జరిగినది.ఈ కార్యక్రమం ఉద్దేశించి డిప్యూటీ డి.ఆమ్.అండ్ హెచ్ ఓహ్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ స్పెషలిస్ట్ హెల్త్ క్యాంప్ సక్సెస్ అయినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆరోగ్య సిబ్బంది ,ఆషా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో అనారోగ్యం తో బాధ పడుతున్న వ్యక్తులను గుర్తించి ఈ ఆరోగ్యశిభిరానికి తరలించడం వలన ఈ ఆరోగ్య శిబిరం సక్సెస్ అయిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్స్ డాక్టర్ సునీత గారు(గైనకాలజిస్ట్), డాక్టర్ వంశీకృష్ణ(ఆర్థోపెడిక్)డాక్టర్ ప్రియాంక (పీడియాట్రిక్)డాక్టర్ క్రాంతి కుమార్(కంటి స్పెషలిస్ట్), డాక్టర్ పి తిరుపతి రావు పాల్గొన్నారు.మండల తహసిల్దార్ శ్రీనివాసరావు ,యం.పి డి ఓహ్ ఈదయ్య , డిప్యూటీ తహసిల్దార్ ఎస్ ముదిరాజు , డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ , మొబైల్ డాక్టర్ సచిన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యుల బతుకులు కుదేలు

- గ్యాస్ ధరలు తగ్గించాలి – వేల్పుల భాస్కర్ డిమాండ్



**సుజాతనగర్, ప్రజాజ్యోతి, మార్చి 10:** వంటగ్యాస్ ధరలను పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మాదిగ ఐక్యవేదిక సుజాతనగర్ మండల అధ్యక్షుడు వేల్పుల భాస్కర్ అన్నారు.మంగళవారం సుజాతనగర్ మండలంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే స్థిరంగా ఉన్న గ్యాస్ ధరలను తగ్గించాల్సింది పోయి మరింత పెంచడం సరైంది కాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేద, సామాన్య మరియు మధ్యతరగతి కుటుంబాలు తమ కుటుంబాలను పోషించుకోవడమే కష్టంగా ఉన్న సమయంలో గ్యాస్ ధరలు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువ కావడంతో చాలామంది అప్పులపాలవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వంటగ్యాస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అలా చేస్తే ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఆ సబ్సిడీ మెజారిటీ ప్రజలకు అందడం లేదని అన్నారు. గ్యాస్ డీలర్లు కేవైసీ, సబ్సిడీ వివరాలపై వినియోగదారులకు సరైన సమాచారం అందించడం లేదని ఆరోపించారు.అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలను కూడా నియంత్రించాలని భాస్కర్ డిమాండ్ చేశారు.

## మాల జన సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు



**అశ్వాపురం, మార్చి 10,ప్రజాజ్యోతి** అశ్వాపురం మండలంలో ఘనంగా సావిత్రిభాయి పూ లే వర్ధంతి వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో మాల జన సమితి అధ్యక్షుడు చెట్టి సురేష్ ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెట్టి సురేష్ మాట్లాడుతూ. బాలికల విద్య కోసం పాఠశాలను ప్రారంభించిన మహోనీయురాలు. కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన తొలి తరం పోరాట యోధురాలు భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు. సంఘసంస్కర్త రచయిత సావిత్రిబాయి పూలే. ఆడది ఇంటిదగ్గర ఉండాలి తప్ప బడిలో పుస్తకాలు పట్టుకోకూడద నే క్రూరం ముగా అమలు జరుగుతున్న. నాటి కాలంలో తన భర్త జ్యోతి రాజు పూలే ప్రోత్సాహంతో. ఆడపిల్లలు చదువు కోసం ఆనాడు. సనాతన సంప్రదాయ వాదులతో. హోరా హోరీగా పోరాడి తన లక్ష్యాన్ని సహకారం చేసుకున్న మహోన్నత శ్రీ మూర్తి చదువుల తల్లి సావిత్రిబాయి. ఆ మహాతల్లి తన జీవిత కాలంలో సనాతన వాదనను ఎదిరించి తాను స్వయంగా 17 విద్యా సంస్థలను నేల కుల్పీ. ఆడపిల్లలకు చదువును సాధారణం చేసింది ఆమె తన జీవిత పర్యాంతం ఆడపిల్లల చదువు కోసం ఇతర సామాజిక సేవల కోసం విశేషంగా కృషి చేసిన ఆదర్శమూర్తి సావిత్రిబాయి. ఈనాడు మహిళలు అనేక రంగంలో గొప్పగా రాణిస్తున్నారు అంటే దానికి కారణం ఆనాడు ఆ మహాతల్లి చేసిన త్యాగ ఫలితమే. భారత దేశంలో నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి అనే వాస్తవాన్ని అందరికీ తెలియ చేద్దాం మనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ధ్రువకుమార్ కుమార్. చెట్టి మల్లేష్. మనోజ్. కరక పెల్లి డేవిడ్. గుణికంటి రవి. ఉండేటి రాజేష్.తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యం – పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా సంస్థలు, ఆరోగ్య కేంద్రాల తనిఖీ
- విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన అధికారులు

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 10,ప్రజా జ్యోతి:** ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని అధికారులు సందర్శించి కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు.అదేవిధంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలను మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ భారతి పరిశీలించారు. పాఠ శాల ల లో స్టోర్ రూమ్, వంటగది, తరగతి గదులు మరియు పాఠశాల ప్రాంగణాన్ని తనిఖీ చేసి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. పాఠశాలలు మరియు హాస్టళ్లలో పరిశుభ్రత పాటిస్తే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి మండల అభివృద్ధి అధికారి మహాలక్ష్మి, మండల పంచాయతీ అధికారి షబ్నా, అన్నపురెడ్డిపల్లి ఉప సర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు



## విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం



**చర్ల, మార్చ్ 10:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రం లోని చిన్న ఇంద్రకీలాద్రి దేవాలయం ఆవరణలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ చర్ల ప్రఖండ సమావేశం ప్రఖండ కార్యదర్శి శివరాజు కిషోర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి 19వ తేదీన ఉగాది ఉత్సవాలు, మార్చి 19 నుండి ఏప్రిల్ 2 వరకు రామోత్సవాలు, ఏప్రిల్ 2 వ తేదీన వీర హనుమాన్ విజయ యాత్ర(బజరంగ్దళ్ బైక్ ర్యాలీ), ఏప్రిల్ 5 వ తేదీన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 14 వ తేదీన డా,, భీమ్ రావ్ రామ్ జీ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించాలనీ, ఏప్రిల్ 4,5 తేదీలలో పాల్వంచ లో జరగబోయే విశ్వహిందూ పరిషత్ జిల్లా వర్గకి, మే 1 నుండి 10 వరకు నర్సంపేట లో జరగబోయే విశ్వహిందూ పరిషత్ భాగ్య నగర్ క్షేత్ర వర్గకి చర్ల ప్రఖండ నుండి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ సమావేశంలో చర్ల ప్రఖండ ఉపాధ్యక్షులు ఇరశ ఒడ్ల. రాము ప్రఖండ కార్యదర్శి శివరాజు కిషోర్ కుమార్ సహ కార్యదర్శి అలవాల మురళీ బజరంగ్దళ్ ప్రఖండ సంయోజక్ ఇన్నమూరి సృజన్ కుమార్, బజరంగ్దళ్ ప్రఖండ సహ సంయోజక్ గాదంశెట్టి ప్రదీప్ , ప్రఖండ మందిర అర్చక పురోత్ ప్రముఖ్ యలమందల భానుప్రకాష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు,ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ లో యవ విభాగం బజరంగ్దళ్ చర్ల ప్రఖండ టోలీ నిర్మాణం చేయడం జరిగింది.బజరంగ్దళ్ చర్ల ప్రఖండ టోలీ(కమిటీ): బజరంగ్దళ్ ప్రఖండ సంయోజక్:ఇన్నమూరి సృజన్ కుమార్, సహ సంయోజక్: గాధంశెట్టి ప్రదీప్, గోరక్షా ప్రముఖ్: పొగాకు నాగేంద్రబాబు,సురక్షా ప్రముఖ్: బోర అప్పారావు,బలోపాసన ప్రముఖ్: గౌలీకర్ ప్రేమ్ కుమార్,సాప్తాహిక్ మిలన్ ప్రముఖ్: తోటపల్లి వంశీ తదితర కార్యకర్తలతో నూతన బజరంగ్దళ్ టోలీ ప్రకటించడం జరిగింది.ఈ సమావేశం అనంతరం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు సంబంధించిన కార్యచరణ చెయ్యడం జరిగింది.

## బోడు హైస్కూల్ లో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



**టేకులపల్లి, మార్చి 10, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు జడ్పీ హైస్కూల్లో మంగళవారం గ్రావిటీ స్కూల్, బీజేపీ ఇల్లందు నియోజక వర్గ నాయకులు బోడా పుణ్యానాయక్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, ఫ్యాడ్స్, స్కేల్లు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోబీజేపీ టేకులపల్లి మండల యువ మోర్చా అధ్యక్షుడు వినోద్ కుమార్, బీజేపీ కొత్తగూడెం జిల్లా మహిళ అధ్యక్షురాలు గంగాబాయి, గ్రావిటీ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, బీజేపీ నాయకులు నవీన్, రాందాస్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు ముందే ఇంటర్ అడ్మిషన్ల హడావిడి

- **రాయితీల పేరుతో కార్పొరేట్ కళాశాలల ఆకర్షణలు**
- **లక్షల్లో ఫీజుల భారం ..పట్టించుకోని అధికారులు**


**పాల్వంచ , మార్చి 10,ప్రజాజ్యోతి :** పదో తరగతి పరీక్షలు ఇంకా పూర్తికాకముందే ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు పోటీగా ముందుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రవేశాలు చేపడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షించేందుకు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. "ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే ప్రత్యేక రాయితీలు, డిస్కౌంట్లు" అంటూ ప్రచారం చేస్తూ విద్యార్థులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి.పదో తరగతి ఫలితాలు వెలువడకముందే అడ్మిషన్లు చేపట్టడం సరైన పద్ధతి కాదని తెలిసినా, ఎక్కువమంది తల్లిదండ్రులు భవిష్యత్తు ఆందోళనతో తొందరపడి పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. ముఖ్యంగా జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ ఇస్తామని చెప్పి కార్పొరేట్ కళాశాలలు భారీగా ప్రచారం చేస్తున్నారు.కొన్ని కళాశాలలు రెండు నెలలుగా స్కాలర్ షిప్ పరీక్షలు నిర్వహిస్తూ మెరిట్ ఆధారంగా ఫీజుల్లో తగ్గింపు ఇస్తామని ప్రకటించాయి. ఈ ప్రకటనలతో ఆకర్షితులైన విద్యార్థులు పరీక్షలు రాసి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అయితే వాస్తవంగా కొద్దిమందికే రాయితీలు లభిస్తుండగా, మిగిలినవారికి మాత్రం లక్షల్లో ఫీజులు విధిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇళ్లకే వెళ్లి అడ్మిషన్ల వేట..**

కొన్ని కార్పొరేట్ కళాశాలలు ప్రత్యేకంగా పీఆర్ వోలు, ప్రతినిధులను నియమించి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకే వెళ్లి అడ్మిషన్ల కోసం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. "ఇప్పుడే సీటు బుక్ చేసుకుంటే ఫీజు తక్కువ" అని చెప్పి అడ్వాన్స్ డబ్బులు కూడా తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.పరీక్షలకు ముందే జరుగుతున్న ఈ అడ్మిషన్లపై విద్యార్థి సంఘాలు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల తరహాలో జూనియర్ కళాశాలల్లో కూడా ఫీజులపై ప్రభుత్వం నియంత్రణ తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాలల ప్రమాణాలు, సదుపాయాలు ఆధారంగా ఫీజులను నిర్ధారిస్తే తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారం తగ్గుతుందని వారు సూచిస్తున్నారు ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నప్పటికీ సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## రానున్న బడ్జెట్ లోనే KTPS 8దశకు నిధులు కేటాయించాలి

- **ఉపాధి, ఉద్యోగులు అభివృద్ధికై "కెటీపీఎస్ 8 వ నెలకొల్పాలి**
- **సమగ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీధర్**



**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి10: ప్రజా జ్యోతి** మసకబారుతున్న పాల్వంచ పట్టణాన్ని వెలుగులతో విరజిల్లే విధంగా ఉండాలన్న,_ ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందాలన్నా, పాల్వంచ పట్టణం పూర్వ వైభవాన్ని చూడాలన్న పాల్వంచలో 8వ దశ కర్మాగారాన్ని నెలకొల్పడం ఎంతో అవసరమని సమగ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కర్మాగారం విషయం పై విద్యుత్ సౌదాలో మార్చి5 వ తేదిన న్యూ ప్రాజెక్ట్ ప్లానింగ్ చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య కు రిప్రజెంటేషన్ చేయగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే 8 దశ నిర్మాణం ప్రారంభం చేస్తామని అన్నారని తెలిపారు,రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కెటీపీఎస్ 8దశ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని , కార్యాచరణని కూడా రూపొందించడం జరిగిందని, కావున విద్యుత్ నగరంగా పాల్వంచను తీర్చిదిద్దాలన్నారు కోరారు,48 సంవత్సరాల పాటు వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని,అభివృద్ధిని కల్పించిన కెటీపీఎస్8 యూనిట్లు ఆగస్టు 5, 2024న కూల్చి వేశారని. దీంతో 720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి శాశ్వతంగా నిలిచిపోయిందని, దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను ట్రాన్స్ఫర్ల పేరుతో చెల్లాచెదురు చేశారని. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక యువత , ప్రజానీకం కుటుంబాలు గడపడం కూడా కష్టమై వలసలు పోయారని అన్నారు, దీంతో పాటు ఎన్ఎండిసి (స్పాంజ్ఐరన్) అప్రకటిత మూసివేత, గతంలో ఏపి స్టీల్ ఐ టి డి ఏ ని ఇక్కడి నుంచి భద్రాచలం కు తరలించటం, రెవిన్యూ డివిజనల్ కార్యాలయాన్ని తీసివేయడం లాంటి చర్యలకు పూనుకున్నారని, మరోపక్క అతిపెద్ద రిలయన్స్ షాపింగ్ మాల్ ను తీసుకొని రావటంతో ములిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఉందని, ఈ కారణంగా సమస్త వ్యాపార వర్గాలు పూర్తిగా డీలా పడ్డాయని, దీంతో వ్యాపారులు అద్దె కూడా కట్టుకోలేని స్థితిలో వ్యాపారాలు మూతపడుతున్నాయని, మున్సిపాలిటీకి వచ్చే గణనీయమైన ఆదాయం తగ్గి అభివృద్ధికి ఆటంకంగా ఉందన్నారు, అదేవిధంగా త్వరలో 5,6 దశ విద్యుత్ కేంద్రాలను కూడా కూల్చి వేస్తారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని , దీంతో మూడు కాంతులు ఆరు వెలుగులుగా ఉన్న పాల్వంచ పట్టణం శిధిలా నగరంగా మారబోతుందని, కావున ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించాలన్న, పాల్వంచ పట్టణం మరింత అభివృద్ధి జరగాలన్నా ,ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ వకాశాలు పొందాలన్నా 8 దశ నిర్మాణం తప్పనిసరని అన్నారు, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పాల్వంచలో సమస్త వనరులు పుష్కలంగా ఉన్నాయని ప్రధానంగా నీరు, బొగ్గు ,స్థలం ఉండడంతోపాటు ప్రస్తుతం 520ఎకరాల భూమి ఇప్పటికే కెటీపీఎస్ కలిగి ఉందని, కిన్నెరసాని ప్రాజెక్ట్ రిజర్వాయర్ నీటి నిలువ 8.4 టీఎంసీలతో సమృద్ధిగా ఉందని, వర్షాకాలం సమయంలో రిజర్వాయర్ నుండి నీరు వృధాగా బంగాళా ఖాతంలో కడుస్తున్నాయని అన్నారు, ఉన్నత, సాంకేతిక,విద్య , శారీరక శ్రమ చేసే యువత కూడా పాల్వంచ పరిసర ప్రాంతాలలో గణనీయంగా ఉందని, కావున అతితక్కువ ఖర్చుతో ,తక్కువ కాలంలో నూతన కర్మగారాన్ని పూర్తి చేసుకోవచ్చుఅని అన్నారు ,8వ దశ నిర్మాణం ద్వారా 2×800 మెగావాట్లు మొత్తం 1600 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది కాబట్టి రాష్ట్ర అవసరాలను కూడా తీరుస్తుందని, వేలాది మందికి శాశ్వత, తాత్కాలిక ఉద్యోగాలు లభిస్తాయని, జిల్లా కేంద్రంలో పాటు పరిసర ప్రాంతాలు, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, మున్సిపల్ కార్పొరేషన్ కు పన్ను ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపల్లిలో 800 మెగావాట్లు విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని, కెటీపీఎస్ 8దశ నిర్మాణానికి కూడా అనుమతులు ఇచ్చి ఈ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు కేటాయించి సకాలంలో ప్లాంట్ నిర్మాణం చేసి ప్రజల ను ఆదుకోవాలని 8వ దశ నిర్మా ణ సాధనకై నిరుద్యోగులు, యువత, వ్యాపారులు, అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఓకే తాటిపై ఉండి పోరాటం చేయాలని కొండపల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు.

## సిఆర్పీఎఫ్ 151 బెటాలియన్ ఉచిత వైద్య శిబిరం



**చర్ల, మార్చ్ 10:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం 87వ సి ఆర్ పీ ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కలివేరులో 151 బిన్ సిఆర్ పీ ఎఫ్ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు .151 బిన్ సి ఆర్ పీ ఎఫ్ కమాండెంట్ శ్రీ రాజీవ్ కుమార్ నేతృత్వంలో చర్ల లోని యూనిట్ ప్రధాన కార్యాలయంలో స్థానిక పౌరుల ప్రయోజనం కోసం రెండు విజయవంతమైన ఉచిత వైద్య ఆరోగ్య తనిఖీ శిబిరాలు నిర్వహించబడ్డాయి. 87వ సి ఆర్ పీ ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈ కార్యక్రమాలు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, నిపుణుల చే నివారణ ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాయి.మార్చి 6న, ఒక నేత్ర వైద్యుడు కంటి సంబంధిత సమస్యలను పరిశీలించగా, ఒక గైనకాలజిస్ట్ వివిధ స్త్రీ జననేంద్రియ సమస్యలపై మహిళలను పరీక్షించి సలహా ఇచ్చాడు. అదనపు పరీక్షలలో రక్తహీనత కోసం హిమోగ్లోబిన్ (హెచ్ బి ), మధుమేహం కోసం యాదృచ్ఛిక రక్త చక్కెర (ఆర్ బి ఎస్ ) రక్తపోటు కోసం రక్తపోటు పర్యవేక్షణ చేసారు. ముందస్తు స్క్రీనింగ్ వల్ల రక్తహీనత, రక్తపోటు, అధిక రక్త చక్కెర, కంటి సమస్యలు స్త్రీ జననేంద్రియ సమస్యలు వంటి సాధారణ వ్యాధులకు సకాలంలో వైద్య సలహా చికిత్స సాధ్యమైంది.హాజరైన నిపుణులలో భద్రాచలం కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ కె. రమేష్ ఉన్నారు. నీలిమ (ఎం బి బి ఎస్ , డి ఓ , డి యెన్ బి – ఆప్తాల్మిక్ సర్జన్), డాక్టర్ ఎ. రమేష్ చంద్ర (ఎం బి బి ఎస్ , డి ఏ – క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్), డాక్టర్ శ్రావణి కొమ్మూరు (ఎం బి బి ఎస్ , ఎం ఎస్ , డి యెన్ బి (ఓ బి జి ), ఎఫ్ ఏ ఎం ఎస్ లు పాల్గొన్నారు .మార్చి 10న, ఈ శిబిరం లో కార్డియాలజీ , ఆర్థోపెడిక్స్‌పై దృష్టి సారించి, రోగనిర్ధారణ సేవలను అందించారు . హైదరాబాద్‌లోని బంజారా హిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ నుండి డాక్టర్ విశ్వనాథ్ (ఆర్థోపెడిక్ సర్జన్) డాక్టర్ సయ్యద్ కాసిం (కార్డియాలజిస్ట్) రోగులను పరీక్షించారు. గుండె ఆరోగ్యం కోసం 2-డి -ఏకో పరీక్షలు ఎముక బలానికి ఎముక ఖనిజ సాంద్రత (బి ఎం డి ) పరీక్షలు నిర్వహించబడ్డాయి.రోగ నిర్ధారణ క్యాంపులో దాదాపు 300 మంది వైద్య సేవలను పొందారు. గ్రామస్తులు సి ఆర్ పీ ఎఫ్ వారి మానవతా సేవలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు . సమాజాన్ని రక్షించడంలో అభివృద్ధి శ్రేయస్సును ప్రోత్సహించడంలో దాని పాత్రను ప్రశంసించారు. ఈ దళం ప్రజల రక్షకుడిగా తన పాత్రను నెరవేరుస్తూనే ఉంది అని అధికారులు అన్నారు .ఈ కార్యక్రమాలను సెకండ్-ఇన్-కమాండ్ శ్రీ కుల్దీప్ సింగ్ చాహర్, సెకండ్-ఇన్-కమాండ్ శ్రీ నితిన్ షిండే, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ అశ్వని వర్మ, ఎస్ ఏం ఓ డాక్టర్ సౌమ్య , ఎస్ ఏం ఓ డాక్టర్ నీరజ్ పాండే విజయవంతంగా నిర్వహించారు.



# నాగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలు

- **ప్రభుత్వ పాఠశాలల లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ శ్రీరామూర్తి**




**పాల్వంచ, మార్చి 10 ప్రజాజ్యోతి:** ప్రభుత్వ పాఠశాలలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని, ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఏ. శ్రీరామూర్తి సూచించారు. మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం గ్రామ సర్పంచ్ స్వప్నతో కలిసి ఎంఈఓ శ్రీరామూర్తి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తమ గ్రామం నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రామస్థులు కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాగారం గ్రామ సర్పంచ్ స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, గ్రామ పెద్దలు కాటారపు వెంకటేశ్వర్లు, సీఆర్‌పీ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాల్వంచలో 35, 44 డివిజన్లలో మేయర్ గణేష్ పర్యటన

- **సమస్యలపై అధికారులకు ఆదేశాలు**



**పాల్వంచ, మార్చి 10, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పట్టణంలోని కొత్తగూడెం నగర్ పాలక సంస్థ పరిధిలో 35, 44 డివిజన్లలో మేయర్ గణేష్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో ఉన్న పలు స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా వంటి అంశాలపై మేయర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా స్థానికులు పట్టణంలో ఉన్న మేడికుంట చెరువు కబ్జాకు గురవుతోందని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మేయర్ గణేష్, మేడికుంట చెరువును పరిరక్షించే చర్యలు తీసుకోవాలని, చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పలు డివిజన్లకు చెందిన సిపిఐ కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామసభ కార్యక్రమం




**చర్ల, మార్చి 10 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం అధికారులు సమస్యలపై గ్రామసభ నిర్వహించారు .మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన సాదారణ గ్రామ సభలో పలువురు ఆక్రమణల విషయాన్ని గ్రామసభ దృష్టికి తీసుకువెల్లారు. ఈ విషయమై స్పందించిన సర్పంచ్ పూజారి సామ్రాజ్యం డ్రైనేజీలను దాటి వచ్చి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. రైస్ పేట్ ఆయిల్ బంక్ వద్ద నుండి పాత చర్ల గాందీబొమ్మ సెంటర్ వరకు, గాందిబొమ్మ సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం, యూనియన్ బ్యాంక్ ల మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు పలువురు వ్యాపారులు, గృహ యజమానులు రహదారిని ఆక్రమించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టిలో ఉందన్నారు. వీటితో పాటు బస్టాండ్ ఎదురుగా గల జవ్వాది నారాయణ మూర్తి రహదారి ఆక్రమణలకు గురయిందన్నారు. దాతలు 40 అడుగుల వెడల్పుతో రహదారిని ఇవ్వగా ఆక్రమణ దారులు ఆ రహదారిని 20 అడుగుల రోడ్డుగా మార్చేసారని తెలిపారు. రెండు రోజులలో ఆక్రమణదారులకు నోటీసులను అందచేసి వారం లోగా ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేసారు. త్వరలో కోతులు, వీది కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోతులు పట్టేవారికి కాలీలేని కారణంగా ఆలస్యమవుతోందని అన్నారు. స్మశాన వాటిక ఆక్రమణ నివారణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా గ్రామ సభకు 17 శాఖలకు చెందిన అదికారులు, ఉద్యోగులు హాజరుకావాల్సి ఉండగా కేవలం ఉపాది హామీ, సెర్ఫ్, అంగన్‌వాడీ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 14 శాఖల వారు గైర్హాజర్ పై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, కార్యదర్శి తోకల సురేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు త్వరలో చెల్లింపు

- **ఎంపీడీవో బొగ్గ నారాయణ హామీ**

**పాల్వంచ, మార్చి 10, ప్రజా జ్యోతి :** పాల్వంచ మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాల సమస్యను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బొగ్గ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆయనతో చర్చించారు.ఈ అంశంపై స్పందించిన ఎంపీడీవో బొగ్గ నారాయణ, కార్మికుల బకాయి వేతనాలను మూడు రోజుల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో పాల్వంచ మండల గ్రామపంచాయతీ కార్మికుల తరఫున ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండలం పంచాయతీ కార్మికులు గుగులోత్ లింబానాయక్, లింగంపల్లి చిన్న బాల కృష్ణ ,సతీష్, శ్రీకాంత్, మమత ఠాగూర్, భోగి వెంకన్న ,లాలు, కొమరయ్య, పాటి రవి ,రామ్ కుమార్, మాలోత్ రాజు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.



## పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**





**కొత్తగూడెం కలెక్టరేట్: మార్చి10:ప్రజా జ్యోతి** మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతో కీలకమైన పరీక్షలు కావడంతో నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగాపరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాలపై నియంత్రణ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాల విషయంలో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, డి పి ఓ సుధీర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాంసం దుకాణాలను తొలగించండి

- **యువజన కాంగ్రెస్ నాయకుడు సాయి చరణ్**



**చర్ల, మార్చి 10:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో మండలవాసులు వివిధ సమస్యలపై పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.చర్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు ప్రదాన రహదారులు ఆక్రమణలకు గురయ్యాయని వాటిని తొలగించాలని యువజన కాంగ్రెస్ నాయకులు చీమకుర్తి సాయిచరణ్ మంగళవారం సర్పంచ్ పూజారి సామ్రాజ్యంకు పిర్యాదు చేసారు. రఘుదియేట్ , తహసీల్దార్ కార్యాలయం సెంటర్, యూనియన్ బ్యాంక్, అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్, జవ్వాది నారాయణమూర్తి రహదారులను కొంతమంది వ్యాపారులు, గృహ యజమానులు ఆక్రమించుకోవడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలవుతున్నారని పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. మరోవైపు రైస్ పేట పెట్రోల్ బంకు వద్ద నుండి పాతచర్ల గాందిబొమ్మ సెంటర్ వరకు విచ్చలవిడిగా మాంసం దుకాణాలను ఏర్పాటు చేయడంతో దుర్గందం వెదజల్లుతోందని పిర్యాదులో పేర్కొన్నారు. దీనికి తోడు మాసం, చేపల వ్యర్ధాలను రహదారి పక్కనే పడవేయడంతో కుక్కల బెడద అదికంగా ఉంటోందని తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే మాంసపు దుకాణాలను తొలగించాలని పిర్యాదులో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం

**టేకులపల్లి,మార్చి10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి కేంద్రంలోని సీసీ రోడ్డు బజారు చెందిన దరావత్ దేవి – ఈరు నూతన ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారి దంపతులను శాలువాతో సన్మానించి వారికి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో వారు నివసించిన ఇళ్ళును చూపించి, ఇపుడు తాము ఇందిరమ్మ ప్రభుత్వంలో కట్టుకున్న కొత్త ఇళ్ళు చూపించి సంతోషపడ్డారు. సొంతింటి కల నేరవేర్చిన ఎమ్మెల్యే కి,కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ ,హౌసింగ్ ఏఈ గణేష్ ,వార్డ్ మెంబెర్లు మూడ్ గణేష్, జాటోత్ కిరణ్, ధరావత్ కొక్య, భూక్యా ఉషా, రామకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, రెడ్యానాయక్, పోశాలు, భద్రు, సంజయ్, లక్ష్మయ్య, సర్దార్,బానోత్ రవి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# 99 రోజుల కార్యాచరణపై సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి10: ప్రజా జ్యోతి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం కోసం కొత్తగూడెం క్లబ్‌లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లోని సమావేశ మందిరాన్ని, సిట్టింగ్ సామర్థ్యాన్ని, భోజన ఏర్పాట్లకు కేటాయించిన ప్రదేశాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధుల సౌకర్యార్థం సభా ప్రాంగణంలో సరిపడా సిట్టింగ్ ను మండలాల వారీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే విధంగా సభా ప్రాంగణాన్ని ఫ్లెక్సీలతో అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం నిర్వహించే ప్రాంగణాన్ని ఫైర్ సేఫ్టీ అధికారులు ముందుగా పరిశీలించి ధ్రువీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణకు తగిన చర్యలు చేపట్టి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.శిక్షణ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అవసరమైన శిక్షణ సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలని, కార్యక్రమం నిర్వహణ కోసం ఎల్‌ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ వంటి సాంకేతిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలని , శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరి కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి, వారికి గుర్తింపు కార్డులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



అలాగే శిక్షణకు హాజరయ్యే ప్రజాప్రతినిధులందరికీ భోజన ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు తెలిపారు.శిక్షణ శిబిరం వద్ద అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌తో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన మాస్టర్ ట్రైనర్లు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల సమర్థ వినియోగం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణ అమలు విధానం తదితర అంశాలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య,డీపీఓ సుధీర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమం పరిశీలించిన మండల విద్యాధికారి

- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన అధికారులు





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 10, ప్రజా జ్యోతి:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో మంగళవారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఆనంద్ కుమార్ కళాశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.కళాశాలలోని నిల్వ గది, వంట గది, త్రాగునీటి శుద్ధి కేంద్రం, తరగతి గదులు, వసతి గదులు, స్నానాల గదులు మరియు కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం విద్యాసంస్థలలో పరిశుభ్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు.అలాగే కళాశాలలో త్రాగునీటి సదుపాయం, విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యత, వసతి గదుల పరిస్థితి గురించి కూడా అధికారులు వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని సూచించారు. విద్యార్థులు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.తదుపరి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాల గురించి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి ఎస్.కే. బురాన్, ఉప వార్డెన్ మధు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పాత పాల్వంచలో అపరిష్కృత రహదారి నిర్మాణానికి శ్రీకారం

- కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



**పాల్వంచ, మార్చి 10, ప్రజా జ్యోతి :** పాత పాల్వంచలోని 46వ డివిజన్ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న రహదారి నిర్మాణానికి కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పూనుకున్నారు. డివిజన్ పరిధిలోని యాటా గోపయ్య బజార్ ప్రాంతంలో ఉన్న రహదారిని అభివృద్ధి చేయడానికి మంగళవారం పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా పట్నంశెట్టి వీరభద్రయ్య ఇంటి వెనుక ఉన్న గల్లిని జేసీబీ సహాయంతో రహదారిని వెడల్పు చేసి, మార్గమధ్యంలో ఉన్న చెట్లను తొలగించారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యపై చర్యలు చేపట్టిన కార్పొరేటర్ విమలాదేవి చర్యలను స్థానికులు అభినందిస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, వార్డు ఆఫీసర్ వరుణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, నాయకులు సయ్యద్ యాకుబ్, లోగాని రామారావు, సయ్యద్ వాజీర్, బూసి శ్రీనివాసరావు, తిరుమలరావు, యాటా అరుణ, చిన్న పండు, యాటా నాని తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు

- రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలల ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్, మార్చి 10 (ప్రజా జ్యోతి):** గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాల, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని, వారి ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థుల సౌకార్యలపై ఆరాతీసి భోజన నాణ్యత, పాఠశాల నిర్వహణ, పరిశుభ్రతను పర్యవేక్షించారు. ఆరుబయట ఉన్న ఐస్క్రీమ్ డిస్క్ బండిని గమనించిన కలెక్టర్ అక్కడకు స్వయంగా వెళ్లి ఐస్క్రీమ్లు గడువుతేదీలు, నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యత లేని, గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయించరాదని స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతి గృహాల్లో బయటి నుంచి వచ్చే ఆహారపదార్థాలు అనుమతించవద్దని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, వంటశాలలో ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకుని రుచి చూశారు. విద్యార్థులకు నిర్ణీత సమయంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, భోజన విషయంలో నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యంపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. పఠనా సామర్థ్యం మరింత పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలుచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరుగుదొడ్లు రోజుకు మూడుసార్లు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఉదయం విద్యార్థులకు రాగిజావ, పల్లిపట్టి ఇవ్వాలని, పదవతరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆ సమయంలో వారికి స్నాక్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, ఎంఈవో యదుసింహరాజు, రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలల నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.

## హెడ్ ఆఫీస్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 10 – ప్రజాజ్యోతి:** సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారము ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కన్వీనర్శ్రీ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళీధరరావు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారి అమూల్యమైన సందేశాన్ని తెలియచేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలో ఆడవాళ్లు ధైర్య సాహసాలతో విపత్తులను ఎదుర్కోవాలని, మహిళా సాధికారతకు కృషి చేయాలని, ప్రస్తుతం మహిళలు అంతరిక్ష రంగం నుండి భూగర్భ గనుల వరకు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ మహిళలకు అన్ని విభాగాలలో అవకాశం కల్పిస్తున్నది అని, కావున సంస్థ కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వృత్తులలో మంచి పేరు తెచ్చుకోవాలని, సింగరేణి నిర్వహించే అంతర్గత ఉద్యోగ నియామక పోటీ పరీక్షల్లో అర్హత సాదించి ఉన్నత స్థానాలను అదిరోహించాలని, ముందు తరం వారికి ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం జిఎం(పర్సనల్) ఐఆర్ పిఎం కవితానాయుడు ను ఘనముగా సన్మానించారు. అదే విధముగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ఏరియా మహిళా ఉద్యోగినులకు, కాంట్రాక్టు ఉద్యోగినులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం మహిళా ఉద్యోగులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్&పిఎం కవితా నాయుడు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్, కన్వీనర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ & ఆర్‌సి ఏజేఎం. మురళీధర రావు, డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ కేసా నారాయణ రావు, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, ఉమెన్స్ డే ఆర్గనైజర్స్ పి.కిరణ్మయి, బి. సుమలత, కే.రమ, డి.శారద, కే.రమ, జిబి. అరుణకుమారి, బి.ప్రియాంక, ఏ.అరుణకుమారి, ఎం.సౌమ్య, టి.శాంత, కార్పొరేట్ ఏరియా మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క మహిళ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- మహిళా దినోత్సవంలో ఏరియా జీఎం

**కొత్తగూడెం సింగరేణి, మార్చి 10 – ప్రజాజ్యోతి:** ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలకు చేరాలని, ప్రతి ఒక్క మహిళ ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయిలను చేరుకోవాలని అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారంన కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆర్.సి.ఓ.ఏ క్లబ్ రుద్రంపూర్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు, డాక్టర్ మామిడి సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గైనకాలజీ) మాతా శిశు హాస్పిటల్ కొత్తగూడెం, ఎం. మనీషా, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, II టౌన్ రామవరం హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమమునకు కన్వీనర్ గా కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ... ఉద్యోగాలలో పురుషులకు




సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని అన్నారు. ఇప్పటికే మహిళలను చైతన్యం వచ్చిందని, మునుముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. అలాగే ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో అక్కడే సుఖసంతోషాలు వర్ధిల్లుతాయని అన్నారు. ఈ సంవత్సరమునకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని "హక్కులు, న్యాయం, చర్య అన్ని మహిళలు మరియు బాలికల కోసం", అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు. ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రస్తుత ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ వారి పురోగతికి వేగవంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా వ్యూహాలు, వనరులు మరియు కార్యకలాపాలను గుర్తించి, వాటి అమలుకు మద్దతు ఇవ్వడం. మహిళలు సమాజంలో అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందాలి, వారి హక్కులను కాపాడాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, మహిళల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలి.నేటి ఆధునిక యుగంలో సాంకేతికత అన్ని రంగాలలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో, మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశం. మహిళ తన యొక్క జీవితాన్ని కూతురుగా, భార్యగా తల్లిగా మరియు మంచి బంధువుగా సమాజంలో తన ధర్మాన్ని నెరవేర్చి కుటుంబా నికి నిర్విరామంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉత్తమ మహిళలుగా డాక్టర్ మామిడి సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ (గైనకాలజీ) మాతా శిశు హాస్పిటల్ కొత్తగూడెం, ఎం. మనీషా, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, II టౌన్ రామవరం సన్మానించడం జరిగింది. అనంతరం సింగరేణి సేవా సమితి కొత్తగూడెం ఏరియా వారిచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విచ్చేసిన వీక్షకులను అలరించడం జరిగింది. ఆ తదుపరి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న వారికి ప్రోత్సాహ బహుమతులను అందించడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియాలోని వివిధ హోదాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎంతో పాటు సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లికార్జున రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, జి.పద్మాజా కోటిరెడ్డి, ఎస్. సునీత మురళీ సెక్రటరీ లేడీస్ క్లబ్, వి.అనిత లక్ష్మి మధుకర్, సిహెచ్. జయశ్రీ రామకృష్ణ, కే. పద్మావతి సూర్యనారాయణ రాజు, ఫాతిమా రజాక్, ఇతర మహిళా ఉద్యోగులు అధికారులు సేవ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం



**చర్ల, మార్చ్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం లక్ష్మీ కాలనీ పంచాయతీ పరిధిలో ని జాంబవంతుడి గుట్టలపై వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఆలయ నిర్వహకులు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణాన్ని గిరిజన పూజారులు గిరిజన ఆచార సంప్రదాయాలలో ఎల్లమ్మ కళ్యాణాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. అమ్మ వారి కల్యాణాన్ని తిలకించడానికి అశేష జనావాహం జాంబవంతుడి గుట్టలకు చేరుకున్నారు . అమ్మ వారి కళ్యాణానికి బీరబోయిన శంకర్ రాణి దంపతులు మరియు ఆర్ ఎస్ కిరణా దంపతుల పట్టు వస్త్రాలను సమర్పించారు. మహిమన్వీత అమ్మలగన్న అమ్మ ను దాతలు ఇచ్చిన పట్టు వస్త్రాలతో అలంకరించితే అమ్మ యొక్క దివ్య రూపాన్ని చూడడానికి రెండు కళ్ళు సరిపోవు అనడంలో అతిశయోక్తి లేదు. జాంబవంతుడి గుట్ట రేణుక ఎల్లమ్మ యొక్క నామస్మరణతో దద్దరిల్లిపోయింది. గిరిజన పూజారులు శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణాన్ని భక్తుల మదిని పులకించే విధంగా కన్నుల విందుగా అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం ఆర్ఎస్ కిరాణా వారు భక్తులందరికీ అన్నదాన ప్రసాదాలను అందించారు. అమ్మవారి కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు పూజారి మడకం దేవా చంటి భరత్ మడకం చందు మడకం రాము తోలెం మల్లయ్య బీరబోయిన శంకర్ గోగికార్ రామలక్ష్మణ్ తదితరులు ఏర్పాట్లను చేశారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణ

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 9 ,ప్రజాజ్యోతి** జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 37 పరీక్షా కేంద్రాలలో మొత్తం 8,737 మంది విద్యార్థులకు గాను 8,518 మంది హాజరై పరీక్ష రాశారని, 219 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించబడినట్లు వెల్లడించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు తెలిపారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్ష బరిలో సీనియర్ న్యాయవాది గొంది మురళీ మోహన్

**దమ్మపేట, మార్చి 10 (ప్రజా జ్యోతి):** దమ్మపేట సివిల్ – ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది గొంది మురళీ మోహన్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. దమ్మపేట కోర్టు ప్రాంగణంలో ఎన్నికల అధికారులకు ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా గొంది మురళీ మోహన్ మాట్లాడుతూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను గెలిపిస్తే న్యాయవాదుల సంక్షేమం మరియు బార్ అసోసియేషన్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానని, అలాగే దమ్మపేటలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు కొనసాగిస్తానని చెప్పారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉడతనేని శ్రీనివాసరావు, శ్యాం సుధాకర్, లక్కినేని నరేంద్ర బాబు, తామా బాలరాజు, దర్గా వలి, అరుణ కుమారి, భవాని, టి. సంజయ్, కాలం సంధ్యారాణి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో గ్రామాల్లో పరిశుభ్రత పనులు



**పిన పాక , మార్చి 10 ( ప్రజాజ్యోతి)**:గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామాలను శుభ్రంగా ఉంచే దిశగా సర్పంచులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్తను తొలగించడం, మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం వంటి పనులను సర్పంచులు పర్యవేక్షిస్తూ నిర్వహిస్తున్నారు. అలాగే చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్ర గ్రామాల నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలిసి సర్పంచులు స్వయంగా పనులను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలకు సూచిస్తూ గ్రామస్థుల సహకారం కోరుతున్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని సర్పంచులు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ కార్యక్రమానికి గ్రామస్థులు కూడా సహకరించాలని కోరారు.

## విద్యుత్ లో వోల్టేజీ సమస్య పరిష్కరించండి :అఖిలపక్షం



**గుండాల ప్రజా జ్యోతి. మార్చ్. 10.** విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు మంగళవారం న్యూ డెమోక్రసీ మాస్ లైన్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ తుడుం దెబ్బ సిపిఎం, బిఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడారు మండలంలో విద్యుత్ అంతరాయం కారణంగా రైతులు నష్టపోతున్నారని లో వోల్టేజ్ తో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు మండలంలో మొక్కజొన్న పంట అధికంగా వేగా విద్యుత్ కారణంగా పంటలు ఎండిపోతున్నాయని 24 గంటలు కరెంటును కోతలు లేకుండా అందించాలని లేకుండా అంతరాయం లేకుండా అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు కోరం సీతారాములు మాస్ లైన్ నాయకులు మంగయ్య ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చంద్రయ్య దొర సిపిఎం నాయకులు రేపాకల నాగేశ్వరరావు గోపి టిఆర్ఎస్ నాయకులు తెల్లం భాస్కర్ టు దెబ్బ నాయకులు వెంకటేశ్వర్లు నరసింహారావు ముక్తాపురం మాముకన్ను సర్పంచులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పై ఆకస్మిక తనిఖీలు



**టేకులపల్లి,మార్చి10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్న భోజన పథకాన్ని మండల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆశ్రమ పాఠశాల (ఏహెచ్ఎస్) కోయగూడెంలో ఎంపీడీఓ బైరు మల్లీశ్వరి, పీఎంహెచ్ బాలుర హాస్టల్లో ఎంఈఓ జగన్ వేర్వేరుగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు విధానాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వంటగదుల పరిశుభ్రత, భోజన పదార్థాల నాణ్యత, నిల్వ విధానం వంటి అంశాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా, నాణ్యతతో వండుతున్నారా వంటి విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావాలని,ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

## రెక్కల రామక్క అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు టౌన్, మార్చి 10, ప్రజాజ్యోతి:** అళ్లపల్లి మండలంలోని మర్కోడు గ్రామంలో ప్రత్యేక ప్రసిద్ధిగాంచిన రెక్కల రామక్క అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరం సురేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 81 బెటాలియన్ బ్లడ్ డొనేషన్ క్యాంప్






**చర్ల, మార్చ్ 10 ప్రజా జ్యోతి :** చర్ల మండలంలో మంగళవారం సిఆర్పిఎఫ్ 87వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సత్యనారాయణపురం లోని సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ లో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపులో మొత్తం 30 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది బ్లడ్ డొనేషన్ చేయగా వారికి భద్రాద్రి బ్లడ్ సెంటర్ వారిచే సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని బ్లడ్ డొనేషన్ క్యాంపు ని విజయవంతం చేశారు .కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్, సెకండ్ కమాండెంట్ సంతోష్ సింగ్ చౌహన్ ,సెకండ్ కమాండెంట్ హిమా న్షు కుమార్, డీఎస్పీ రాజేష్ డొగ్ర ,డాక్టర్ దామోదర్ సింగ్, ఏసి తారాచంద్ మీనా, డాక్టర్ యామిని సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్య మెడికల్ ఉచిత అకాడమీ బ్రోచర్ ఆవిష్కరణ

**ఇల్లందు, మార్చి 10, ప్రజాజ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇల్లందు పరిసర ప్రాంత పేద, గిరిజన విద్యార్థులకు ఉపయోగపడే ఆదిత్య మెడికల్ ఉచిత అకాడమీ బ్రోచర్ ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవిష్కరించారు. పేద, గిరిజన విద్యార్థులు నిట్, ఐఐటి, జెఈఈ మెయిన్స్ ఉచిత కోచింగ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8074441525 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మడుగు సాంబమూర్తి, కౌన్సిలర్లు రేఖ స్వరూప, రాధ కమల్ కోరి, చెనిగరపు శృతి, సోని బాయి కోరి, నీరుడు ఉపేంద్ర, ఉల్లింగ విజయలక్ష్మి, రంప రమ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొత్తగూడెం వాసులకు అరుదైన వైద్యం

- మోకాళ్లలో గుజ్జు పెరిగేందుకు ఇంజెక్షన్లు లేవు
- ఆక్సిడెంట్ కేసుల్లో పాలిట్రామా అత్యవసరం
- ప్రముఖ వైద్యుడు దాచేపల్లి సునీల్



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 10 – ప్రజాజ్యోతి:** ఆక్సిడెంట్ కేసుల్లో, భవనంపై పడి తీవ్ర గాయాలపాలై రక్త స్రావం జరిగితే మొదట పాలిట్రామా అవసరమని ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు దాచేపల్లి సునీల్ తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిట్రామా అంటే ఆక్సిడెంట్, ఇతరత్ర ప్రమాదాలలో శరీరంలోని ఏ ఏ భాగాలు దెబ్బ తిన్నాయో తెలుసుకొని అవసరమైన చోట ఆపరేషన్ చేసేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందని చెప్పారు. మోకాళ్లలో గుజ్జు పెరిగేందుకు ఇంజెక్షన్లు లేవని, గుజ్జు పెంచుతామని ఇంజెక్షన్ల పేరుతో వైద్యం చేస్తున్నవారిపై మెడికల్ కౌన్సిల్ లో కేసులు నడుతున్నాయని, అబద్ధపు ప్రచారాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అనవసరంగా సమయం వృథా చేయకుండా అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో వున్న హాస్పిటల్ కు వెళ్లాలని, అనవసరంగా సమయాన్ని వృధా చేయవద్దని సూచించారు. ఇటీవల కొత్తగూడెం ప్రాంతానికి చెందిన సందీప్ రోడ్ ప్రమాదానికి గురై వచ్చారని అతనికి మోకాళ్ళు, నడుము, వెన్నుపూస తో పాటు రకరకాల సమస్యతో హాస్పిటల్ వచ్చారని ' పాలిట్రామా ' చేసి అధునాతన వైద్యం అందించడం వల్ల ప్రస్తుతం పూర్తిగా కోలుకొని ఆరోగ్యవంతుడిగా ఉన్నారని వివరించారు. మరో రోగి శ్రీనివాస్ మోకాళ్ళ లింగమెంట్ సమస్య తో వచ్చారని అతనికి అవసరమైన పరీక్షలు చేసి ఆపరేషన్ చేసి మూడు వారాలలో నడిచేలా చేశామని చెప్పారు. మోకాళ్ల సమస్య ఉన్నప్పుడు ఎం ఆర్ ఐ తీయిస్తేనే సమయము గుర్తించగలమన్నారు. ఇప్పటికే కొత్తగూడెం వాసుల కోసం నెలలో రెండవ వారం వచ్చి ఇక్కడ వైద్యం చేస్తున్నానని ఈ ప్రాంతం పై వున్న ప్రేమ తోనే ప్రజలకు మోకాళ్ళ సమస్యల పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వైద్యం కోసం ఏ డాక్టర్ వద్దకు వెళ్లిన అనుమానం ఉంటే సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని కానీ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రస్తుత సమాజంలో మోకాళ్ల సమస్య తో అనేక మంది బాధపడుతున్నారని లింగమెంట్ సమస్య తీరుస్తామని, జాయింట్ రీప్లేస్ మెంట్ ఇంకా ఎన్నో ఆపరేషన్లు చేస్తామని వైద్యులు చెప్తున్నప్పటికీ ఏ రోగి కి ఏ ఆపరేషన్ కచ్చితంగా చెప్పలేక రోగుల సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగమెంట్, జాయింట్ రీప్లేస్ మెంట్ ఎవరికి అవసరమో గుర్తించి వైద్యం చేస్తేనే రోగి ఉపశమనం పొందుతాడని కానీ ఈ సమస్యలను పట్టించుకోకుండా కొంత మంది వైద్యులు ఆపరేషన్ చేస్తున్నారన్నారు. భవిష్యత్తు లో ఈ ప్రాంతంలోని ప్రజలకు మోకాళ్ళ సమస్యల పై తనకు ఉన్న పరిజ్ఞానంతో వైద్యం చేస్తూ వారి సమస్యను దూరం చేసేందుకే ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ. శ్రీనివాస్ రెడ్డి, వట్టి గణేష్ లతో పాటు వైద్యులు దాచేపల్లి సునీల్ చేసిన ఆపరేషన్ విధానం గురించి శ్రీనివాస్, సందీప్ లు కూలంకషంగా వివరించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## గ్రామీణ వైద్యులు సత్యనారాయణ మృతి బాధాకరం

- గ్రామీణ వైద్యుల సహాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకటరావు



**సుజాత నగర్ ప్రజాజ్యోతి మార్చి 10:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, పోలారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు సత్యనారాయణ మృతి చాలా బాధాకరం అని గ్రామీణ వైద్యుల సహాయక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకట్రావు అన్నారు. మంగళవారం మృతుని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు.మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌమ్యుడు, మితభాషి అయిన అందరి మన్ననలు పొందిన, గ్రామీణ వైద్యులు ఆకస్మిక మరణం ఆ ప్రాంత ప్రజలకు తీరని లోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సహాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి నటరాజ్ అంగోజు, జిల్లా సహాయ కార్యదర్శి గడదేసి ప్రేమ్ కుమార్, ఇల్లందు మండల అధ్యక్షులు కాంతారావు, మండల కార్యదర్శులు మోహన్ రావు, సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, చాంద్ పాషా, భద్రం, గ్రామీణ వైద్య సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ వసతులపై ఆరా విద్యార్థులతో ఆత్మీయ భేటీ

- ఆళ్ళపల్లి తహశీల్దార్



**ఆళ్ళపల్లి. మార్చి10. ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (KGBV) మంగళవారం ఆళ్ళపల్లి తహశీల్దార్ డి. జగదీశ్వర ప్రసాద్ ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించడమే కాకుండా, విద్యార్థినులకు అందుతున్న భోజన సదుపాయాలు. ఇతర వసతులపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.తహశీల్దార్ స్వయంగా విద్యార్థినులతో ముచ్చటించి, వారికి అందుతున్న విద్య, వసతి. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల మధ్య కూర్చుని వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తో పాటు సీనియర్ అసిస్టెంట్ జబ్బ ఎర్రయ్య, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (ఆర్ఐ) రామయ్య, జీపీఓలు చిరంజీవి, రాధా కుమారి, రమణ.పాఠశాల అటెండర్లు పాల్గొన్నారు.

## విద్యార్థినుల్లో ప్రతిభాభివృద్ధికి 'మైండ్ స్పార్క్' కార్యక్రమం

**దమ్మపేట, మార్చి 10 (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం,దుర్గం గొల్లగూడెం లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల మేధస్సు, విద్యా నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఉద్దేశంతో 'మైండ్ స్పార్క్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా గణితాన్ని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సులభంగా నేర్చుకునే విధంగా విద్యార్థినులకు అవకాశాన్ని కల్పిస్తున్నారు. డిజిటల్ విధానంలో బోధన జరగడం వల్ల విద్యార్థినుల్లో అభ్యాసంపై ఆసక్తి మరింత పెరుగుతోందని ఉపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావడానికి ఐదు ల్యాప్ టాప్ లను అందించి సహకరించిన మేనేజర్ వికాస్ ఓమర్, అసోసియేట్ మేనేజర్ శివప్రసాద్, ప్రాజెక్ట్ లీడ్ మల్లికార్జున్, కోఆర్డినేటర్ ఉమా మహేష్, అలాగే భీమ్, బన్నీ గార్లకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం విద్యార్థినుల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిటి ఉపాధ్యాయురాలు భావనతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినులకు మార్గనిర్దేశం చేశారు.



## 25వ డివిజన్ కార్పొరేటర్ కేకే శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**కొత్తగూడెం, మార్చి 10 ( ప్రజాజ్యోతి )** ఇటీవల జరిగిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 25వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన కేకే శ్రీనివాస్‌ను ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన సన్నిహితులు మరియు అభిమానులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి ఆయనకు అభినందనలు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా అందరితో కలిసిమెలిసి మెలిగే మనసున్న నాయకుడిగా కేకే శ్రీనివాస్ పేరుపొందారని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. 25వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా కేకే శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో యర్ర కామేష్, అడ్వకేట్ హరి, బండి భాస్కర్, వేల్పుల భాస్కర్, చదలవాడ సూరి, సెనగ లక్ష్మణ్, మొగలిపాక మురళీకృష్ణ, కనకం సూరిబాబు, పిట్టల సతీష్, కాకటి బాబు, కండె మహేష్, నవీన్, అర్వ కిషోర్, మాటూరి విష్ణు, పోస్ట్ ఆఫీస్ వాసు, కనకం చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

- కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు
- చీపురు పట్టి శుభ్రతలో పాల్గొన్న పంచాయతీ పాలక వర్గం



**దమ్మపేట, మార్చి 10 (ప్రజా జ్యోతి):** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో మంగళవారం దమ్మపేట గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను పంచాయతీ పాలకవర్గ సభ్యులు పారిశుధ్య సిబ్బందితో కలిసి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ తేజ రాణి కార్యక్రమంలో పాల్గొని సిబ్బందితో కలిసి చెత్తను తొలగిస్తూ శుభ్రత కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. మర్రి భక్తాంజనేయ స్వామి ఆలయం సమీపంలోని పంచాయతీ స్థలం, పశువుల ఆసుపత్రి పరిసరాలు, వాసవి క్లబ్ పక్కన ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచారు. గ్రామంలో శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ చెత్త తొలగింపు, రహదారుల శుభ్రపరిచే కార్యక్రమాలు, డ్రైనేజీల శుభ్రపరచడం చేపట్టారు. అలాగే ఇంటింటికీ తడి, పొడి చెత్తను వేరు చేయాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, గోళ్ళ భవాని, కృష్ణ యాదవ్, బత్తుల సాయి, రూప రాంబాబు, చాట్ల శ్రీను, ఉయ్యాల లక్ష్మీనారాయణ, సిబ్బంది విజయ్, సింగ్, గణేష్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే వర్ధంతి... ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట, మార్చి 10 (ప్రజా జ్యోతి):** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ మంగళవారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళల విద్యకు పునాది వేసిన మహనీయురాలని కొనియాడారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించి సమాజంలో అణగారిన వర్గాలకు విద్యా వెలుగులు పంచారని తెలిపారు. మహిళలు చదువుకుని సమాజంలో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఆమె జీవితాంతం కృషి చేశారని అన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా హక్కుల కోసం ఆమె చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.మహిళల సాధికారత, విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళులు అర్పించారు.

## వ్యాపార వర్గాల్లో ఎన్నికల సందడి

- చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు నామినేషన్లు
- 22 సంఘాలలో సుమారు 300 మంది ఓటర్లు





**అశ్వారావుపేట, మార్చి 10, ప్రజాజ్యోతి :** నియోజకవర్గ కేంద్రంలోని వ్యాపార వర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది.చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. అశ్వారావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ లో 22 సంఘాలు ఉండగా సుమారు 300 మంది ఓటర్లు ఉన్నారు. 10వ తేదీ నామినేషన్లు స్వీకరించగా ఉపసంహరణకు నేటి సాయంత్రం వరకు గడువు విధించగా,15వ తేదీ ఎన్నిక జరగనుంది. ఎన్నికల్లో అధ్యక్ష పదవికి తోకల హరీష్ గుప్తా,దుపకుంట్ల దుర్గారావు, సంక ప్రసాదరావు, జల్లిపల్లి శ్రీరామమూర్తి, జల్లిపల్లి శ్రీనివాసరావు, కంచర్ల భాస్కరావు, కక్కిరాల నరేష్ మద్దు సత్యనారాయణ నామినేషన్ లు వేశారు. ఈ ఎన్నికలకు నిర్వాహకులుగా కొనిజర్ల ఉమామహేశ్వరరావు, చారుగుండ్ల వెంకన్నబాబు, కోరుకొండ భోగేశ్వరరావు వ్యవహరించనున్నారు. నేడు ఉపసంహరణల అనంతరం ఎవరెవరు పోటీలో ఉంటారనేది తేలనుంది.

## పోడు సమస్యపై ఫారెస్ట్ అధికారులతో చర్చలు జరిపిన సి పి ఐ నాయకులు



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి10, ప్రజాజ్యోతి** పాల్వంచ మండల పరిధిలోని రేగులగూడెం, మామిడిగూడెం, రాళ్ళ చెలకపోడు, గ్రామాలకు చెందిన రైతుల భూముల లో ట్రెంచ్ కోట్టే సమయం లో రైతులకు ఫారెస్ట్ అధికారుల మధ్య హద్దుల విషయంపై సమస్య రావడంతో సి పి ఐ నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని పోడు సాగుదారులు ప్రోక్లైన్ ల ను అడ్డుకుని. ఫారెస్ట్ అధికారులతో చర్చించి.పోడు రైతుల కు – ఫారెస్ట్ అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హోద్దులు నిర్ణయించి సమస్యను పరిష్కరించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు ప్రజా సంఘాల నాయకులుపూనెం రమేష్ ,ఆలెం సమ్మయ్య,వజ్జా సత్యం,కాలం శ్రీనివాసరావు, బి రాజేష్,వీరాస్వామి, లక్ష్మయ్య,జి రమేష్, గంగయ్య, నందా, వి బాబు,ఈసం కన్నయ్య, శేఖర్, చంటి, భీమా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోడు రైతుల భూముల్లో ట్రెంచ్ పనులు వారం రోజులు గడువు కోరిన మాజీ ఎంపీపీ



**ఆళ్ళపల్లి,మార్చి10ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండలం అడవిరామవరం గ్రామ పరిధిలోని పోడు భూముల వద్ద ఉద్రిక్తత నెలకొంది. అడవిరామవరం గ్రామ రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీ శాఖ అధికారులు మంగళవారం 'ట్రెంచ్' (కందకాలు ) తవ్వే పనులను చేపట్టారు.దీనిపై సమాచారం అందుకున్న మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి క్షేత్ర స్థాయికి చేరుకొని కాచినపల్లి అటవీశాఖ అధికారుల తో మాట్లాడారు. తమ వద్ద భూమికి సంబంధించిన పట్టాలు సాగులో ఉన్నట్లుగా తగిన ఆధారాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని. (మాజీ ఎంపీపీ ) కొండ్రుమంజు భార్గవి అటవీ శాఖ అధికారులకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. అందులో రైతుల వద్ద ఉన్న పట్టాలు ఇతర ఆధారాలను అధికారుల ముందు ఉంచడానికి వారం రోజుల పాటు గడువు కావాలని కోరారు. అప్పటి వరకు కందకాలు తవ్వే పనులను నిలిపివేయాలని విన్నవించారు. పేద గిరిజన రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని, వారికి న్యాయం చేయాలని అధికారులను కోరారు. వారం రోజుల్లో రైతులు తమ ఆధారాలను సమర్పించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ అధికారులను కోరేరు చేశారు.

## అంగన్వాడి టీచర్ కు సన్మానం



**ఇల్లందు, మార్చి 10, ప్రజాజ్యోతి:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందు గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మంగళవారం 24 ఏరియా యుపిఎస్ పాఠశాలలోని అంగన్వాడీ కేంద్రంలో గత 30 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ శకుంతల, అంగన్వాడి ఆయా లక్ష్మీనర్సులను గాయత్రి పరివార్ 24 ఏరియా బాధ్యులు కాతం సరోజ, పులిపాటి ప్రేమలత రమాదేవిల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించి మెమొంటో అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన 24 యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, టీచర్లు నాగమణి, అదిలక్ష్మి వారిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా చిన్నారులకు సేవలు అందించడం, ఓనమాలు నేర్పించడం హర్షించదగ్గ విషయమన్నారు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రంలో రవీందర్, మధు తదితరులు పాల్గొన్నారు.